

జ్వరాలపై ఇంటింటా సర్వే

భామిని, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): సీజనల్ జ్వరాలపై ఇంటింటా సర్వే చేసి రోగులను గుర్తించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి ఆదేశించారు. శుక్రవారం లోవగూడ, నల్లరాయిగూడలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సందర్శించారు. లోవగూడలో జ్వరాలపై ఆరా తీశారు. జ్వర లక్షణాలతో వచ్చిన వారికి రక్త పరీక్షలు చేయాలని సిబ్బందికి సూచించారు. భామిని పీహెచ్‌సీ పరిధిలో 109 మందికి వైద్య పరీక్షలు చేయగా ఏడుగురికి, నల్లరాయిగూడలో 52 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి నలుగురికి జ్వరాలు ఉన్నట్టు సంబంధిత వైద్యులు తెలియజేశారు.

మరమ్మతులు చేయరు..
కొత్తవి వేయరు!

- తరచూ మొరాయిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు
- విద్యుత్ సరఫరా లేక పొలాల్లో సాగునీటికి ఆటంకం
- రైతులకు తప్పని అవస్థలు
- స్పందించని అధికారులు

గరుగుబిల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. రోజులు గడుస్తున్నా.. వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడం లేదు. కనీసం మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. దీంతో రైతులకు సాగు నీటి కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం పార్వతీపురం, పాలకొండ డివిజన్ల పరిధిలోని పంట పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు అధికంగా మరమ్మతులకు గురవుతున్నాయి. పిడుగులు, వర్షాలు, చెట్ల కొమ్మలతో పాటు అధిక లోడు కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు మూలకు చేరాయి. నెలలు గడుస్తున్నా వాటిని మార్పు చేయడం లేదు. దీంతో విద్యుత్ సరఫరా కాక పంటలు సాగు చేయలేని పరిస్థితి ఏర్పడింది. తీవ్ర వర్షాభావం నేపథ్యంలో మోటార్ల సాయంతోనైనా పంట పొలాలకు నీటిని మళ్లిద్దామనుకున్న రైతులకు నిరాశే మిగులుతోంది. వేసవిని తలపించేలా ఎండలు దారెత్తిస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగూరు, కుదమ సబ్‌స్టేషన్ల పరిధిలో తోటపల్లి, నాగూరు, రావివలస, చిలకాం, కారివలసతో పాటు పలు గ్రామాల్లో సుమారు 25 ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. గత రెండు నెలల కిందట కురిసిన వర్షాలు, ఉరుములు, మెరుపుల కారణంగా జిల్లాలోని ప్రతి మండలంలో 20కి పైగా మూలకు చేరాయి. దీంతో మోటార్ల సాయంతో పంటలు పండించే వారికి ఇబ్బందులు తప్పడం లేదని తురకనాయుడు వలసకు చెందిన రైతులు ఎం.శివున్నాయుడు, మరిశర్ల అప్పల నాయుడు తదితరులు వాపోతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు మార్పు చేయాలని పలు దఫాలు అధికారులను కోరినా నేటికీ ఎటువంటి స్పందన లేదన్నారు. నీరు లేక వరి ఉబాలు చేసు కోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తు న్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా.. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు కాలేదని తెలిపారు. మరమ్మ తులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్ల సమాచారాన్ని ఉన్నతాధికారులకు వివరించామని చెప్పారు.




నాగూరు-తురకనాయుడువలస వద్ద నీటి సౌకర్యం లేక ఊబాలుకు నోచుకోని పంట పొలాలు



చిలకాంలో మరమ్మతులకు నోచని ట్రాన్స్‌ఫార్మర్

సాగుకు సాయం

- అన్నదాత సుఖీభవకు సర్వం సిద్ధం
- నేడు రైతుల ఖాతాల్లోకి నిధులు జమ
- జిల్లాలో 1.22 లక్షల మందికి లబ్ధి



పార్వతీపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీ అమలు చేసేందుకు రంగం సిద్ధమైంది. అర్హులైన రైతన్నల ఖాతాల్లోకి శనివారం అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు జమచేయనుంది. ఈ మేరకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాగు సాయంగా పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రూ. 20 వేలు అందజేయనున్నారు. మొదటి విడతగా నేడు కేంద్రం తరఫున రూ.2 వేలు, రాష్ట్ర సర్కారు నుంచి రూ.5 వేలు చొప్పున జమ చేయనున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో గుర్తించిన 1,22,260 మంది రైతుల ఖాతాల్లో మొదటి విడతగా రూ. 84.58 కోట్లు జమకానుంది. మొత్తంగా మూడు విడతలుగా రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ కింద రూ.6 వేలు, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14 వేలు జమ కానుంది.

గత వైసీపీ ప్రభుత్వంలో ...

గత ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.ఆరు వేలు అందించగా.. అప్పటి వైసీపీ సర్కారు రూ.7,500 అందించేవారు. మొత్తంగా రైతులకు రూ. 13,500 అందేది. మొదటి విడతగా కేంద్రం నుంచి రూ.2వేలు , రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.3 వేలు అందించేవారు. ఆ తర్వాత మిగిలిన ఆర్థిక సహాయం రెండు విడతలుగా అందజేసేవారు.

నేడు పండుగ వాతావరణంలో...

జిల్లాలోని నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లో పండుగ వాతావరణంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములవనున్నారు. సాలూరులో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, కురుపాంలో ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, సీతానగరం మండలం గుచ్చిమిలో

(మిగతా 6వ పేజీలో...)

జమకానున్న నిధులు ఇలా..

మండలం	రైతులు	రూ.కోట్లు
సాలూరు	11,078	7.75
బలిజిపేట	7,980	5.59
సీతంపేట	9,501	6.65
సీతానగరం	8,947	6.26
వీరఘట్టం	8,793	6.16
గుమ్మలక్ష్మీపురం	7,672	5.37
గరుగుబిల్లి	7,708	5.40
భామిని	6,334	4.43
జియ్యమ్మవలస	9,233	6.46
కొమరాడ	7,287	5.10
కురుపాం	7,184	5.03
పాచిపెట	5,881	4.12
మక్కువ	7,303	5.11
పాలకొండ	8,479	5.94
పార్వతీపురం	8,880	6.22

పార్టీ ఆదేశానుసారం
పనిచేయాల్సిందే

- పాలకొండ శ్రేణులకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా స్పష్టీకరణ
- కొందరు పార్టీ నాయకులు జనసేన ఎమ్మెల్యేతో పనిచేస్తున్నారు
- గ్రామ, మండల కమిటీల నియామకంలో అడ్డు పడుతున్నారు
- ఫిర్యాదు చేసిన కొందరు నియోజవర్గ పార్టీ నాయకులు

విశాఖపట్నం/పార్వతీపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అధినాయకత్వం ఆదేశాలు మేరకు నాయకుడి నుంచి కార్యకర్త వరకు పనిచేయాల్సిందేనని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాశ్రీనివాసరావు స్పష్టం చేశారు. శుక్రవారం విశాఖ జిల్లా పార్టీ కార్యాలయంలో అరకు పార్లమెంట్ పరిధిలోని పాలకొండ నియోజకవర్గం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో నాయకుల మధ్య విభేదాలు పరిష్కరించుకోవాలన్నారు. అందరూ కలిసి పార్టీ బలోపేతానికి పనిచేయాలని, లేకపోతే అధిష్టానం ఒక నిర్ణయం తీసుకుంటుందని హెచ్చరించారు. సమన్వయం చేసుకోకపోవడంతో గ్రామ/మండల కమిటీల నియామకం పూర్తిచేయలేదని, ప్రభుత్వం పిలుపు మేరకు సుపరిపాలన కార్యక్రమం కూడా చేయకపోవడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. రెండుమూడు రోజుల్లో ఇన్‌చార్జి పడాల భూదేవి, అన్ని మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు కలిసి చర్చించుకుని కార్యక్రమాల అమలు దిశగా పనిచేయాలని సూచించారు. • ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జి దామచర్ల సత్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, విభేదాలు వీడాలని కోరారు. నియోజకవర్గంపై పార్టీ దృష్టిసారించిందన్నారు. నియోజకవర్గ

(మిగతా 6వ పేజీలో...)

91 శాతం
పింఛన్ల పంపిణీ

పార్వతీపురం/గరుగుబిల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో శుక్రవారం తొలిరోజు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ 91.16 శాతం మేర జరిగింది. 15 మండలాలు, మూడు పట్టణాల పరిధిలో 1,40,676 మందికి గాను ప్రభుత్వం రూ.60.10 కోట్లు మంజూరు చేసింది. కాగా సచివాలయ సిబ్బంది ఉదయం ఆరు గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను కూడా లబ్ధిదారులకు అందజేశారు. పండుగలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమి శ్రేణులు భాగస్వాములయ్యారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

- ప్రభుత్వ విప్ జగదీశ్వరి



కురుపాంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

కురుపాం/గరుగుబిల్లి/గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. స్పౌజ్ కేటగిరీ మంజూరైన నూతన పింఛన్లను శుక్రవారం కురుపాంలో లబ్ధిదారులకు అందించారు. ఆర్థిక ఇబ్బందులున్నా.. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఒకటవ తేదీనే లబ్ధిదారులకు పెంచిన పింఛన్ అందిస్తుంద న్నారు. అనంతం గరుగుబిల్లి మండలం ఖడ్గవలసలోనూ వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 1,634 మందికి స్పౌజ్ కోటా కింద పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ప్రజలకు అసౌకర్యం కలగకుండా పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఏడాది సమయంలోనే రహదారుల అభివృద్ధి, సాగునీటి వనరుల కల్పన, రైతులు, నిరుద్యోగ యువతకు అవసరమైన పథకాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. నేడు అన్నదాత సుఖీభవ కింద నగదు జమవగా, 15న మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నారని వెల్లడించారు. ఆ తర్వాత ఆమె గుమ్మలక్ష్మీపురంలోనూ పింఛన్లు పంపిణీ చేశారు.

రోజూ కళాశాలకు వెళ్లాలి

- వసతిగృహ విద్యార్థులకు సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సూచన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

పాలకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులు రోజూ కళాశాలకు వెళ్లాలని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం పాలకొండ బాలుర పోస్టు మెట్రిక్ వసతిగృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. కళాశాలకు వెళ్లకుండా వసతిగృహాల్లో ఉండ కూడదని తెలిపారు. బాగా చదివి ఉన్నత స్థాయి చేరుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు.

దుర్భిలి కొండల్లో
ఏనుగులు



4లో

ఆరుగురు విద్యార్థులు
ఎక్కడికెళ్లారు?

- వసతిగృహ నిర్వహణపై ప్రత్యేక అధికారి అసహనం

6లో

సంగీత కళాశాలలో
ప్రవేశాలకు ఆహ్వానం

5లో

ఆర్టీసీ అద్దె బస్సు
డ్రైవర్ల సమ్మె

6లో

పోలీసుల సంక్షేమానికి
ప్రాధాన్యం

- ఎస్పీ మాధవరెడ్డి

6లో

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు

- పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ

పార్వతీపురం రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ హెచ్చరించారు. శుక్రవారం డోకిశీల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య స్థితిగతులు తెలుసుకుని ధైర్యం చెప్పారు. అనంతరం ఉపాధ్యాయులు, వైద్య సిబ్బందితో సమీక్షించారు. సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ఎప్పటికప్పుడు విద్యార్థులను పరిశీలించాలన్నారు. ప్రత్యేక శ్రద్ధను కనబర్చాలని లేకుంటే ఉపేక్షించేది లేదన్నారు. వారి బాగోగులు చూడాల్సిన బాధ్యత సంక్షేమ, వైద్యాధికారులపై ఉందన్నారు. ఇకపై ఇటువంటివి

(మిగతా 6వ పేజీలో...)



విద్యార్థులను పరామర్శిస్తున్న ఇన్‌చార్జి పీవో

పైనాపిల్ పార్క్‌కు మన్యం అనుకూలం

- మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్‌భరత్

పార్వతీపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పైనాపిల్ పార్క్‌కు జిల్లా అనుకూలమని .. ఆ దిశగా చర్యలు చేపట్టాలని మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మెప్మా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..' విదేశాల్లో పైనాపిల్‌కు మంచి గిరాకీ ఉంది. ఈ ప్రాంతంలో పైనాపిల్ దిగుబడి అధికంగా ఉన్నందున.. పార్క్ ఏర్పాటుపై దృష్టి సారించాలి. యూనిట్ స్థాపనకు అవసరమైన శిక్షణను నిపుణులతో ఇప్పిస్తాం. చెత్త నుంచి సంపద సృష్టించాలి. ఇంటి వద్దనే వర్మీకంపోస్టును తయారు చేసి విక్రయించొచ్చు. టెర్రాస్ గార్డెన్ ద్వారా ఆకు, కూరగాయలను పండించి ఆదాయం పొందొచ్చు. బ్యాంకు లింకేజీల్లో మరింత పారదర్శకత పెంచేందుకు యాప్‌ను అందుబాటులోకి తీసుకొస్తాం. మెప్మా కార్యకలాపాలన్నీ యాప్ ద్వారానే జరగనున్నాయి.' అని తెలిపారు.



మాట్లాడుతున్న మెప్మా డైరెక్టర్ తేజ్‌భరత్

133 మంది
కానిస్టేబుళ్లగా ఎంపిక

పార్వతీపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం తుది ఫలితాలు విడుదల చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా నుంచి 133 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. మన్యం జిల్లాలో గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు చెందిన అనేకమంది ఉత్తమ ప్రతిభ చూపి ఉద్యోగాలను సొంతం చేసుకున్నారు. బలిజిపేట మండలం గళావల్లి గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు కానిస్టేబుళ్లగా ఎంపిక కావడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా వీరికి సెప్టెంబరు నుంచి శిక్షణ ఇవ్వనున్నారు.



ప్రత్యేక అలంకరణలో కోటదుర్గమ్మ

శ్రావణ సందడి

- కోటదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు

పాలకొండ, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా తెల్లవారు జామునే పరిసర ప్రాంతాల నుంచి భారీగా భక్తజనం తరలివచ్చారు. దీంతో క్యూలైన్లన్నీ నిండిపోయాయి. ప్రత్యేక అలంకరణల్లో ఉన్న అమ్మవారిని వారు దర్శించుకుని పులకించిపోయారు. ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో సుమారు రెండు వేల మంది మహిళా భక్తులు కుంకుమపూజలు, లలితా పారాయణం నిర్వహించారు. ఈవో వీవీ సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పింఛను.. ఆనందం తెచ్చెను

- స్పౌజ్ కోటా వర్తింపుపై మహిళల్లో సంతోషం
- ప్రభుత్వానికి లబ్ధిదారుల కృతజ్ఞతలు

జీవిత చరమాంకంలో ఉన్న వృద్ధులు వారు. భర్తలు దూరమై.. బతుకు భారమై కష్టంగా కాలం వెళ్లదీస్తున్న జీవులు. ప్రభుత్వం ఇటీవల తీసుకున్న నిర్ణయం వారి మోముల్లో ఆనందాన్ని నింపింది. రేపటిపై ఆశలు రేకెత్తించింది. భర్తలు చనిపోయిన భార్యలకు పింఛను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం.. దానిని తాజాగా అమలు చేయడంతో ఆ మహిళల కళ్లలో చెప్పలేని సంతోషం కనిపిస్తోంది. శుక్రవారం అత్యధిక శాతం మహిళలు పింఛన్లు అందుకున్నారు. కుటుంబ అవసరాలకు ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం లేదని కొందరు.. అనారోగ్యంతో బాధ పడుతున్న తమకు మందుల కొనుగోలుకు ఈ డబ్బులు ఉపయోగపడతాయని కొందరు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది..



సాలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నా భర్త పీత రాములప్పడు 2024 జూన్ 14న అనారోగ్యంతో మృతిచెందాడు. నాకు అయిదుగురు సంతానం. అందులో నలుగురు ఆడపిల్లలు. ఒక్కడే కొడుకు. వాడు ఆటో డ్రైవర్. నలుగురు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసి అత్తారిళ్లకు పంపడంతో నాకు చాలా ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. నా భర్త గత ఏడాది మృతిచెందాడు. కూటమి ప్రభుత్వం దయవల్ల నాకు పింఛను మంజూరైంది. దీంతో చాలా ఆనందంగా ఉంది. కొంతవరకు మా ఆర్థిక ఇబ్బందులు గట్టెక్కుతాయి. -పీత పైడమ్మ

సీఎం దయవల్లనే..



శృంగవరపుకోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వితంతు పింఛను కోసం రెండేళ్లుగా ఎదురు చూస్తున్నాను. నా భర్త చనిపోయిన తరువాత పింఛను కోసం దరఖాస్తు చేశాను. అప్పుడు రాలేదు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి దయ వల్ల ఇప్పుడు రూ.4 వేలు పింఛను అందించారు. ఇన్నాళ్లకు పింఛను అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. -మంగి కొండమ్మ

ఈ పింఛనే ఆధారం..

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నా భర్త ఆంజనేయులు 15 నెలల క్రితం చనిపోయారు. కూటమి ప్రభుత్వం ఇప్పుడు నాకు పింఛను మంజూరు చేసింది. నా ఆరోగ్యం బాగోలేక ఏ పనీ చేయడం లేదు. ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యం, ఈ పింఛన్‌తోనే బతుకు వెల్లదీయడానికి నాకు అవకాశం దొరికింది.



-బోటు భూలక్ష్మి

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటా..



జామి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నా భర్త చనిపోయాక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాను. ఆయనకు పింఛను వచ్చేది. ఆ డబ్బులతో సంతోషంగా ఉండేవాళ్లం. అతని ఆకస్మిక మరణంతో అన్నివిధాలుగా ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. నాలో పనిచేసే శక్తి లేక పస్తులు ఉండాల్సి వచ్చింది. నాలాంటివారి పరిస్థితిని గుర్తించి.. భర్త చనిపోయిన కొద్ది నెలలకే సీఎం చంద్రబాబు మాకు పింఛన్లు ఇచ్చి.. ఆర్థిక భద్రత కల్పించారు. ఏమిచ్చినా ఆయన రుణం తీర్చుకోలేను. జీవితాంతం ఆయన పేరు చెప్పుకొని బతకడం తప్ప. -ఈగల మారమ్మ

ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నాను..



గుర్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నాకు పింఛను మంజూరు చేయించడం ఆనందంగా ఉంది. ఎన్నో రోజులుగా పింఛను కోసం ఎదురు చూస్తున్నా. అసలు పింఛను అందుకుంటానో లేదోనని కంగారు పడ్డాను. తెలుగుదేశం ప్రభుత్వం, చంద్రబాబు నాయుడు పింఛను అందించడంతో ఆనందంగా ఉంది. -సూరమ్మ

పింఛనే జీవనాధారం..



గరుగుబిల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వితంతు పింఛనే ఈ వృద్ధాప్యంలో నాకు జీవనాధారం. కుమారులు ఉన్నట్లయితే పింఛను అవసరం లేదు. నాకు నలుగురు కుమార్తెలు. ఇప్పుడు ఒంటరిగా ఉంటున్న నాకు పింఛను ఎంతో ఊరటనిస్తోంది. -గులిపల్లి గౌరమ్మ,

ఆనందంగా ఉంది..



బొబ్బిలి ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నా భర్త శేషగిరిరావు పొగాకు చుట్టలు చుట్టి కుటుంబాన్ని పోషించేవాడు. ఆయన అనారోగ్యంతో మూడేళ్ల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి నాకు కష్టాలు ప్రారంభమయ్యాయి. నా పిల్లలు కాయకష్టం చేసుకుంటూ వేరే చోట జీవిస్తున్నారు. నా పోషణ చూసుకుంటున్నారు. పింఛను వస్తే నా బతుకేదో నేను బతుకుదామనుకున్నాను. మూడేళ్లుగా మంజూరు చేయకుండా తిప్పారు. చంద్రబాబు వచ్చిన తరువాత మంజూరైంది. చాలా ఆనందంగా ఉంది. -బాలకృష్ణవేణి

బతకడానికి ఆధారం..



భోగాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బతకడానికి ఈ డబ్బులే ఆధారమని కడమటి అప్పయ్యమ్మ కన్నీటిపర్యంతమవుతోంది. 'మొన్నటి వరకు మా ఆయన కడమటి సన్యాసి ఉండేవాడు. చిన్నచిన్న పనులు చేసేవాడు. ఆపై పింఛను వచ్చేది .దీంతో బతకడానికి అవకాశం ఉండేది. మా కుమారుడు వేరే కాపురం ఉంటున్నాడు. నా భర్త మరణించాక ఆయన పింఛను నాకు ఇవ్వడం వల్ల నేను బతకడానికి ఆధారం దొరికినట్లయింది. ఈ డబ్బులే నెలంతా ఆధారం. ఎటువంటి ఇబ్బంది లేకుండా పింఛను నేరుగా అందించడం చాలా ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు నిండు నూరేళ్లు చల్లగా ఉండాలి' అంటోంది అపయ్యమ్మ. -కడమటి అప్పయ్యమ్మ

కొడుకులా ఆదుకున్నారు..

లక్కవరపుకోట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వితంతు పింఛను ఇచ్చి పెద్దకొడుకులా చంద్రబాబు నాయుడు ఆదుకున్నారు. నా భర్త చనిపోయాడు. నాకు కళ్లు సరిగ్గా కనిపించవు. నన్ను ఎవరు ఆదుకుంటారు? మందులకు డబ్బులు ఎలా వస్తాయని ఆందోళన చెందాను. పింఛను వచ్చిందని తెలిసి ఆనందించాను. చంద్రబాబుకు రుణపడి ఉంటాను.



-మేడిబోని దేవుడమ్మ

రెండేళ్లుగా ఎదురు చూస్తున్నా..



చీపురుపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నా భర్తకు వృద్ధాప్య పింఛను వచ్చేది. ఆయన రెండేళ్ల కిందట చనిపోయారు. ఆ పింఛను నాకు బదిలీ కావడానికి రెండేళ్ల పట్టింది. ఈ రెండేళ్లుగా వేచి చూస్తున్నాను. నెలకు రూ.నాలుగు వేల పింఛను అందుకోవడం సంతోషంగా ఉంది. -పసుపురెడ్డి లక్ష్మీనరసమ్మ

కొండంత అండగా ఉంది..

మక్కువ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నా పేరు జలుమూరు పాపమ్మ. నా భర్త జలుమూరు బాబులు చనిపోయి ఏడాది అయింది. నా ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలకు వివాహాలయ్యాయి. ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నేను ఒక్కదానినే నివాసం ఉంటున్నాను. నాకు ఎటువంటి ఆసరా లేదు. కష్టపడే ఓపిక లేదు. కూటమి ప్రభుత్వం దయతో నాకు ఈ రోజు వితంతు పింఛను మంజూరైంది. నాకు ప్రతినెలా వచ్చే రూ.నాలుగు వేలతో ఎవరిపై ఆధారపడకుండా బతకవచ్చు.



పింఛను అందుకుంటున్న పాపమ్మ

ఎంతో సంతోషం..

సాలూరు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నా పెనిమిటి కొర్ర బుచ్చయ్య కాలం చేసి ఏడాది పైనే కావస్తోంది. ఆయనకు పింఛను వచ్చేది. దీంతో ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఇల్లు గడిచేది. ఆయన కాలం చేసిన తరువాత పింఛను రాలేదు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం దయవల్ల పింఛను డబ్బులు వచ్చాయి. ఇక ప్రతి నెలా డబ్బులకు ఇబ్బంది ఉండదు. పెద్దకొడుకులా సీఎం చంద్రబాబునాయుడు ఆదుకున్నారు. ఎంతో ఆనందంగా ఉంది.



పింఛను అందుకుంటున్న బుచ్చమ్మ



సాలూరు కామాక్షి ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

వైభవంగా శ్రావణ పూజలు



అలంకరణలో అమ్మవారు

సాలూరు రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం కామాక్షి, వాసవీ కన్యాకాపరమేశ్వరి తదితర ఆలయాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు. కామాక్షి అమ్మవారి దేవాలయంలో శారద సత్సంఘ వ్యవస్థాపక గురువు ముద్దు సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సాలూరు సంతోషిమాత భక్తులకు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. రామాలయంలో లక్ష్మీదేవికి పూజలు చేశారు. పాచిపెంట మండలం పణుకువలసలో సమరసత ఫౌండేషన్ ప్రతినిధి దూపం శంకరరావు ఆధ్వర్యంలో గిరిజన మహిళలు వరలక్ష్మీదేకి కుంకుమ పూజలు చేశారు. మాజీ జడ్పీటీసీ మంచాల పారమ్మ తదితరులు పాల్గొన్నారు.



జ్ఞాన సరస్వతికి ప్రత్యేక పూజలు

పాలకొండ, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక నక్కలపేటలో ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో కొలువుదీరిన జ్ఞాన సరస్వతి అమ్మవారికి శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా పసుపు కొమ్ములతో అలంకరించి పూజలు చేశారు. మహాలక్ష్మి, పార్వతీ దేవి, లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారిని అలంకరించారు. ఆలయ ధర్మకర్త పలాల కొండలరావు, ప్రధాన అర్చకులు పర్రి శరత్ పూజలు చేశారు.

దుర్భిలిలో ఏనుగుల గుంపు



కురుపాం/కురుపాం రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దుర్భిలి గ్రామ పరిసర కొండల్లో గల జీడి, మామిడి తోటల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఈ సందర్భంగా ఫారెస్టు రేంజి అధికారి గంగరాజు మాట్లాడుతూ గిరిజనులు పోడు వ్యవసాయం నిమిత్తం కొండల పైకి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఏనుగుల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ప్రయాణించాలని సూచించారు.

దుర్భిలి కొండల్లో సంచరిస్తున్న ఏనుగులు

కష్టపడి.. ఉద్యోగం సాధించి!

- కానిస్టేబుళ్లుగా ఎంపికైన కుర్రాళ్లు
- అధికశాతం మధ్యతరగతి కుటుంబాలే
- నిరంతర శ్రమతో ఉద్యోగాల సాధన

నిరంతర సాధన... ఎలాగైనా సాధించాలనే తపన... తల్లిదండ్రులకు కష్టాన్ని గుర్తించి.. వారికి అండగా నిలవాలనే యోచన... భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలనే ప్రయత్నం... పోలీసు ఉద్యోగంలో చేరాలనే దీక్ష... ఇవన్నీ ఆ యువకులను లక్ష్య సాధన వైపు నడిపించాయి. తోటివారికి ఆదర్శంగా నిలిచేలా చేశాయి. తల్లిదండ్రులు... మిత్రులు... గ్రామస్థులు గర్వపడేలా చేశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిలో అత్యధికం సామాన్య కుటుంబాల వారే ఉండడం గమనార్హం.

గిరిజన యువకుల ప్రతిభ

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గొరడ గ్రామానికి చెందిన తాడంగి తరుణ్ అనే గిరిజన యువకుడు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తరుణ్ తండ్రి బంగారురాజుకు వ్యవసాయమే ఆధారం. మంగళాపురం గ్రామానికి చెందిన మరో గిరిజన యువకుడు ఆరిక మురళి కూడా పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. వీరిని స్థానికులు అభినందించారు.



తరుణ్



ఆరిక మురళి

ఒకే ఊరి నుంచి ఐదుగురు



రమేష్ వసంతకుమారి షణ్ముఖరావు సురేష్

గరివిడి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వెదుళ్లవలస గ్రామానికి నలుగురు యువకులు, ఒక యువతి పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. గ్రామానికి చెందిన సుంకరి రమేష్, అగూరు వసంత, ఎత్తుల సురేష్, గుడివాడ షణ్ముఖ, విసినిగిరి శ్రీనులు పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని గ్రామస్థులు అభినందించారు.



శ్రీను

ఒకే పంచాయతీ నుంచి 8 మంది

నెల్లిమర్ల, జూలై 1(ఆంధ్రజ్యోతి): సీతారాముడుపేట పంచాయతీ పరిధిలోని సీతారామునిపేట, జగ్గరాజుపేట గ్రామాలకు చెందిన 8 మంది యువకులు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సీతారామునిపేటకు చెందిన అక్కడ రాకేష్, కల్యాణం రమణ, దన్నాన సాయికుమార్, లెంక వెంకటష్, జగ్గరాజుపేటకు చెందిన కల్యాణం జగదీష్, కల్యాణం నారాయణరావు, పంచాది సాయి, కంది శ్రీను పోలీసులు ఉద్యోగాలు సాధించారు.

రాష్ట్రంలో రెండో స్థానం...



అప్పలనాయుడును అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

వంగర, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తలగాంకు చెందిన పారిశర్ల అప్పలనాయుడు పోలీసు కానిస్టేబుల్ అర్హత పరీక్షలో 200 మార్కులకు గాను 167 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండో సాధించాడు. పోలీసు ఉద్యోగానికి ఎంపికైన అప్పలనాయుడును మద్దువలస కళాశాల సిబ్బంది అభినందించారు.

ఒకే గ్రామం నుంచి ఐదుగురు



యువకులను సత్కరిస్తున్న స్థానికులు

రేగిడి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): అంబఖండికి చెందిన ఐదుగురు యువకులు పోలీసు ఉద్యోగాల ఎంపిక పరీక్షల్లో సత్తా చాటారు. ఎందవ వైకుంఠరావు, పల్లి మురళి, పుర్లి హరీష్, పుర్లి సాయి, గులివిందల విశేశ్వరరావులు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిని సర్పంచ్ శానపు లక్ష్మీగోవిందనాయుడు, గ్రామ పెద్దలు సత్కరించారు.

మొదటి స్థానంలో నిలిచి...

దత్తిరాజేరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గడసాం గ్రామానికి చెందిన గొర్లె రమ్యామాధురి సివిల్ కానిస్టేబుల్ పోటీ పరీక్షల్లో మహిళా విభాగంలో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించింది. రమామాధురి తల్లి ఆశావర్కరుగా పనిచేస్తున్నారు. తండ్రి చిన్నతనంలో మృతిచెందడంతో తల్లి కష్టార్జితంతో చదివించింది. రమ్యను గ్రామస్థులు అభినందించారు.



రమ్యామాధురి

ఒకే కుటుంబంలో ఇద్దరికి...

గజపతినగరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గంగచోళ్లపెంట గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు గ్రామానికి చెందిన అక్కంద్ర శ్రీనివాసరావు, అక్కంద్ర ఆదిబాబులు పోలీస్ ఉద్యోగాలకు ఎంపికైనట్టు కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. తమ బిడ్డలు ఇద్దరికీ జిన్నాం గ్రామానికి చెందిన నారాయణరావు కానిస్టేబల్‌గా ఎంపికయ్యారు. పాతబగ్గాం గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. సంగంరెడ్డి గణేష్, కడమల దినేష్, సంగంరెడ్డి హేమంత్, కుమలి ధనంజయ్, తగరంపూడి పవన్‌కల్యాణ్ పోలీస్ ఉద్యోగాలు సాదించార వీరిని గ్రామ సర్పంచ్ లెంక పద్మావతి, స్థానికులు అభినందించారు.



శ్రీనివాసరావు, ఆదిబాబు

ఒకే గ్రామం నుంచి ముగ్గురు...

కొమరాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మార్కొండ పుట్టి గ్రామానికి చెందిన బొంగు మణికంఠ, పెనుబంటి గణేష్, బోనెల గణేష్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అభినందిస్తున్నారు. మండలంలోని మరికొన్ని గ్రామాల యువకులు కూడా పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.



బొంగు మణికంఠ



బోనెల గణేష్

పేదరికాన్ని జయించి...

వీరఘట్టం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గడగమ్మ గ్రామానికి చెందిన పెంకి శివ పేదరికాన్ని అధిగమించి పోలీసు ఉద్యోగం సాధించాడు. ఆయన తండ్రి సూరపునాయుడు పదేళ్ల కిందట చనిపోయాడు. తల్లి సత్యవతి వ్యవసాయ పనులు చేస్తూ ఒకే ఒక్క కొడుకైన శివను చదివించింది. ఇంటర్, డిగ్రీ సత్యసాయి ట్రస్టు సహకారంతో ఉచితంగా పలాసలో చదివాడు.



పెంకి శివ

ఒకేసారి అయిదు ఉద్యోగాలకు...



ప్రసన్నపాల్ అనిల్‌కుమార్ ఉపేంద్ర సూర్యనారాయణ



సింహాచలం అనంతరావు వెంకటలక్ష్మి

సంతకవిటి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు గ్రామానికి చెందిన వావిలపల్లి అనిల్‌కుమార్ ఒకేసారి 5 విభాగాల్లోనూ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. ప్రస్తుతం తెలంగాణలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అనిల్ కుమార్ ఏపీ సివిల్, ఏపీఎస్పీ, నేవీ, సీఆర్‌పీఎఫ్, అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. తండ్రి కేశవరావు వ్యవసాయ కూలీ, తల్లి శ్రీదేవి గృహిణి. రామారాయిపురం గ్రామానికి చెందిన సిరిపురపు గురువులు, గోవిందమ్మల కుమారుడు ప్రసన్నపాల్ బీటెక్ పూర్తి చేశాడు. పోలీసు ఉద్యోగ ఎంపిక పరీక్షలో పాల్గొని కొలువు సాధించాడు. హొంజరాం గ్రామానికి చెందిన మామిడి ఉపేంద్ర, పెద్దింటి సూర్యనారాయణ, బూరాడపేటకు చెందిన చింతాడ సింహాచలం కూడా పోలీసు ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

- మోదుగులపేట గ్రామానికి చెందిన వడ్డి నారాయుడు, జయమ్మలు వ్యవసాయ కూలీలు. వీరి కుమారుడు వడ్డి అనంతరావు పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఎమ్ఆర్ అగ్రహారం గ్రామానికి చెందిన నిద్దాన వెంకటలక్ష్మి పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

ఒకే కుటుంబంలో ఇద్దరికి...

గుర్ల, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శాసపుపేట గ్రామానికి చెందిన అన్నదమ్ములు సువ్వాడ రాంబాబు, రమణ అనే సోదరులు పోలీసు కొలువులు సాధించారు. వీరి తల్లిదండ్రులు సువ్వాడ భావనమ్మ, పాపారావులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అన్నదమ్ములు ఇద్దరూ ఉద్యోగాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.



తల్లిదండ్రులతో అన్నదమ్ములు

సాగు భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఎలా ఏర్పాటు చేస్తారు?

రామభద్రపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తాము ఎన్నాళ్ల నుంచే సాగుచేసుకుంటున్న భూముల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు స్థలాలు ఎలా కేటాయిస్తారని కాకర్లవలస, కారేడువలస గిరిజనులు ప్రశ్నించారు. శుక్రవారం పార్కు ప్రదేశంలో జేసీబీలతో సాగుచేస్తున్న పనులను గిరిజనులు అడ్డగించారు. అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. భూములను పార్కు పేరుతో లాక్కుంటే తమకు ఆత్మహత్య తప్ప మరొక మార్గంలేదని గిరిజనులు స్పష్టం చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు బలసా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వందలాది మంది గిరిజనులు తరలిరాగా పోలీసులు, వారికి మధ్య కాసేపు వాగ్వాదం జరిగింది. ఒకానొక దశలో తోపులాట జరిగింది. ఇద్దరు గిరిజన మహిళలు స్పృహ తప్పి పడిపోయారు. ఈ ఆందోళన అదుపు చేసేందుకు రామభద్రపురం ఎస్ఐ వి.ప్రసాదరావు, బాడంగి ఎస్ఐ తారకేశ్వరరావు, సిబ్బంది పెద్ద ఎత్తున మోహరించారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

చీపురుపల్లి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల్ని పరిష్కరించడమే ప్రజా దర్బార్ లక్ష్యమని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. చీపురుపల్లిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన సమస్యలకు తక్షణమే స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

90 శాతం పరిష్కారం..

రాజాం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాదర్బార్ నిర్వహించినప్పటి నుంచి ఇప్పటి వరకు 90 శాతం సమస్యలు పరిష్కరించామని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వినతులు స్వీకరించారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించి, సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు.

కేథలిక్ నన్స్ అక్రమ అరెస్టును ఖండిద్దాం

విజయనగరం గంటస్తంభం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్‌లోని దుర్గ్ రైల్వేస్టేషన్‌లో జూలై 25న ఇద్దరు కేథలిక్ నన్స్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండించాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, నేషనల్ దళిత క్రిస్టియన్ వాచ్ కన్వీనర్ జాన్ కెనడీలు అన్నారు. శుక్రవారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. దేశంలో మత అసహనానికి, చట్టాల దుర్వినియోగానికి ఈ అరెస్టులు నిదర్శనమన్నారు. యూనియన్ నాయకులు పోతురాజు, చిన్నారావు, పోలయ్య పాల్గొన్నారు.

ఎంఈవో పోస్టులను పీఆర్ ఉపాధ్యాయులకు ఇవ్వాలి

చీపురుపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎంఈవో పోస్టులను పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఇవ్వాలని పీఆర్టీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘానికి చెందిన ఉపాధ్యాయులు శుక్రవారం అన్ని పాఠశాలల్లో నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం ఉన్న రెండు ఎంఈవో పోస్టులను పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే, ప్రభుత్వం మాత్రం పక్షపాతంగా వ్యవహరిస్తోందన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా దేవీమాధవి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డా.దేవీ మాధవి నియమితులయ్యారు. శుక్రవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన డా.కె.పద్మలీల పదవీ విరమణ చేశారు. బాధ్యతలు స్వీకరించిన దేవీమాధవికి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెంట్ డా.అప్పలనాయుడు, ఇతర అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

సీడీపీవోగా రజనీదుర్గ

రాజాం రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ రాజాం సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న జి.రజనీదుర్గకు సీడీపీవోగా పదోన్నతి లభించింది. ఈమెను పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఈమేరకు శుక్రవారం ఆమె ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొత్తవలస, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): వియ్యంపేటలో ఉన్న అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సంలో ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్‌వీఎస్‌లక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తిగల విద్యార్థులు నేరుగా పాఠశాలకు ఈనెల 4వ తేదీ లోగా గుర్తింపు కార్డు, విద్యార్హత పత్రాలు తీసుకొచ్చి హాజరు కావాలని సూచన సూచించారు. మరిన్ని వివరాలకు 9704550020కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునని తెలిపారు.

రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి

రాజాం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సెప్టెంబరు 14, 15 తేదీలలో డివిజన్ స్థాయి రాష్ట్ర మహాసభలను విజయనగరంలో నిర్వహిస్తున్నారని, అందరూ విజయవంతం చేయాలని రాజాం డివిజన్ అధ్యక్షుడు గొర్లె రమేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు జరజాన నీలయ్య, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనరు ఆర్‌వీజే నాయుడు, జేవీవీ నాయకులు ఆర్నిపల్లి వెంకటనాయుడు, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు



భోగాపురం: పింఛన్ అందజేస్తున్న నెల్లిమర్ల ఎమ్మెల్యే నాగమాధవి



లక్కవరపుకోట: పింఛన్ పంపిణీ చేస్తున్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి



గుర్ల: పెనుబర్తిలో పింఛన్ల పంపిణీలో చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు

కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యేలు తెలిపారు. జిల్లాలో శుక్రవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

ప్రజల ఆనందమే ప్రభుత్వ ఆనందం

భోగాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆనందమే ప్రభుత్వ ఆనందమని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. భోగాపురం గ్రామంలో నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆమె శుక్రవారం పంపిణీ చేశారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

లక్ష మందికి పైగా కొత్త పింఛన్లు

లక్కవరపుకోట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి పైగా స్పౌజ్ కోటాలో పింఛన్లు అందజేసినట్టు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శుక్రవారం ఆమె ఎల్.కోటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● కొత్తవలస: మండలంలోని దేవాడ, ముసిరాం, వియ్యంపేట పంచాయతీ కొట్టానవానిపాలెం, మిందివలస రామచంద్రపురం గ్రామాల్లో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు.

పేదల కోసం పుట్టిన పార్టీ టీడీపీ

గుర్ల, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పేదల కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. పెనుబర్తి గ్రామంలో శుక్రవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సీసీ రోడ్డును ప్రారంభించారు. వెన్నె సన్యాసినాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు సీహెచ్ మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

రేగిడి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లు అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు అన్నారు. మునకలవలస గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిలో రాజాంలో రూ.100కోట్లతో రోడ్ల అభివృద్ధితో పాటు పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు.



రేగిడి: మునకలవలసలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు



పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

పరామర్శల పేరుతో జగన్ డ్రామాలు

విజయనగరం రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎరామర్శలు పేరుతో జగన్ డ్రామాలు ఆడుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున విమర్శించారు. నగరంలోని గాజులరేగలో స్పౌజ్ కోటా కింద నూత నంగా మంజూరైన వితంతు పింఛన్లను ఆయన శుక్ర వారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆగస్టు నెల నుంచి కొత్తగా 4,824 పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబుకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. తప్పు లు చేసి జైలు పాలైన వారిని పరామర్శలు చేస్తూ, డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేరులో సత్యం ఉన్నా.. ఆయన ఎప్పుడూ అసత్యాలే చెబుతుంటార న్నారు. ఆయన మంత్రిగా పదేళ్ల కాలంలో విజయనగ రం జిల్లాకు, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు ఏమి చేశారని ఆయన ప్రశ్నించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు 'అన్నదాత సుఖీభవ' పంపిణీ

రాజాం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పాలకొండ రోడ్డులో ఎస్ఆర్ కన్వెన్షన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్, కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ పథకం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ శాఖ ఏడీ కె.చంద్రరావు, ఏవో చీకటి రఘునాథ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజాం మండలంలో 9,152 మందికి రూ.4.58కోట్లు, రేగిడి మండలంలో 11,986 మందికి రూ.5.99 కోట్లు, సంతకవిటి మండలంలో 11,984 మందికి రూ.5.99 కోట్లు, వంగర మండలంలో 5,862 మందికి రూ.2.93 కోట్లు పంపిణీ చేస్తారని చెప్పారు. ● గజపతినగరం, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత చేతులమీదుగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మొదటి విడత నిధులు జమ చేయనున్నట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ ఎ.నిర్మలాజ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ యార్డులో నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొనాలని కోరారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

రాజాం రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాజాం మున్సిపాలిటీ పరిధిలో కారుణ్య నియామకాలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాజాం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులతో కలిసి ధర్నాకు దిగారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజాం మున్సిపాలిటీలో పలు విభాగాలలో విధులు నిర్వహించి మరణించిన వారి పిల్లల్లో అర్హులైన వారికి వారి అర్హతను బట్టి ఉద్యోగ నియామకాలు చేయాలని కోరారు. మృతుల కుటుంబాలకు చెల్లించాల్సిన రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లించలేదని ఆయన ఆరోపించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు.

ఆరో డివిజన్‌లో పింఛన్ల పంపిణీ

విజయనగరం టౌన్, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధి, ఆరో డివిజన్‌లో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు గంటా రవి, కోట్ల పైడిరాజు, ఉగాది రావు పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈసందర్భంగా గంటా రవి మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తుందన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు గంటా రవి

టీడీపీ మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ

భోగాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా పోలిపల్లి గ్రామానికి చెందిన కర్రోతు సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకుడు ఎండి నజీర్, నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు సమక్షంలో పార్టీ మండల కమిటీ, అనుబంధ కమిటీల ఎన్నిక జరిగింది. ఈసందర్భంగా సత్యనారాయణను పార్టీ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన 16వ సారి ఎన్నికయ్యారు. మండల తెలుగు యువత అధ్యక్షుడిగా మౌళీవర్మను ఎన్నుకున్నారు. నీలాపు అప్పలరామిరెడ్డి, శ్రీను, వెంకటరమణ, రాజు పాల్గొన్నారు.

కార్యకర్తల పరిస్థితి దారుణంగా ఉంది

భోగాపురం, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ కార్యకర్తల పరిస్థితి దారుణంగా ఉందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. దీనిలో భాగంగా కార్యకర్తలు తమ సమస్యలను బంగార్రాజు దృష్టికి తీసుకువెళ్లారు. తమను ఎమ్మెల్యే గానీ, జనసేన పార్టీ నాయకులు గానీ ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన వద్ద మొరపెట్టుకున్నారు. జనసేన నాయకులు తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమకు ఏ పనీ కావడం లేదని ఏకరువు పెట్టారు. దీనిపై బంగార్రాజు మాట్లాడుతూ ఇక్కడి కార్యకర్తల పరిస్థితి దారుణంగా ఉందని, ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించాలని నియోజకవర్గ పరిశీలకుడు నజీర్‌కు సూచించారు. అనంతరం ముక్కాం గ్రామానికి చెందిన బూత్ కన్వీనర్, కార్యకర్త చల్లపల్లి అప్పన్నను సన్మానించి, రూ.5వేలు అందజేశారు. అనంతరం బంగార్రాజు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.



కార్యకర్తను సన్మానిస్తున్న బంగార్రాజు

స్వీమ్స్ మెమోరియల్ 150 వసంతాల ఉత్సవాలు

విజయనగరం బాబామెట్ట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో స్వీమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి 150 వసంతాల ఉత్సవాలు సెప్టెంబరు 10 నుంచి 14 వరకూ నిర్వహిస్తున్నామని సంఘ కార్యదర్శి ఆర్ఎస్ జాన్ తెలిపారు. శుక్రవారం స్థానిక చర్చి ఆవరణలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ వేడుకల్లో ముఖ్య ప్రసంగీకులుగా హొసన్నా మినిస్ట్రీస్ రాజమహేంద్రవరం ప్రతినిధి జాన్ వెస్లీ, వేద నాయకం, నవీన్ పగడాల, ప్రవీణ్ బృందం, ప్రొఫెసర్ హేమలత, బెన్ని ప్రసాద్, ప్రభాకర్ పాల్గొంటున్నారని చెప్పారు. వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. బీఎం రాజు, ప్రభాకర్, శ్యామ్యూల్ పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలన

విజయనగరం/ రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): విజయనగరం మండలం ద్వారపూడి గ్రామంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాన్ని కలెక్టర్ అంబేడ్కర్ శుక్రవారం సందర్శించారు. సంపద ఎలా తయారు అవుతున్నదీ.. పరిశీలించారు. అలాగే తయారైన ఎరువును కూడా పరిశీలించి ఎక్కడ ఎలా విక్రయిస్తున్నదీ ఆరా తీశారు. నర్సరీలు పెంచే వారితో మాట్లాడుకుని వారికి విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చునన్నారు. జిల్లాలో ఉన్న ఎంపీడీవోలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ద్వారపూడి కేంద్రం వద్ద నిర్వహించనున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు, శిక్షణ బాధ్యతను విజయనగరం ఎంపీడీవో గంటా వెంకటరావుకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో డీపీవో మల్లికార్జునరావు, తహసీల్దార్ కూర్మానాథరావు, సర్పంచ్ ఆదిలక్ష్మీ, ఏపీఎం, సీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు పదోన్నతి కల్పించాలి

కొత్తవలస, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): హైస్కూల్ హెచ్‌ఎంలకు సీనియార్టీ ప్రకారం ఎంఈవో, డిప్యూటీ డీఈవో, డీఈవోలుగా పదోన్నతులు కల్పించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. శుక్రవారం కొత్తవలస వచ్చిన సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో సీనియర్‌కు ఎంఈవో-1గా నియమించాలని కోరారు. ఉపాధ్యాయులకు సంబంధించి పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు, ఏరియర్స్, డీఏ ఏరియర్స్ గత ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని చెల్లించాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరామని, దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారంపై తెలియజేశామని, ఈ సమస్యను పరిష్కారం చేస్తామని తెలిపారన్నారు. పీఆర్టీయూ నాయకుడు చుక్క ఈశ్వర అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

● వివిధ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు

● భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా జిల్లాలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రకాల అలంకరణలో దర్శమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, పూజలు నిర్వహించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



చీపురుపల్లి: నిమ్మకాయల అలంకరణలో కనకమహాలక్ష్మి



విజయనగరం కల్చరల్: పసుపు కొమ్ముల అలంకరణలో విజయసాగర మల్లేశ్వరీ



శృంగవరపుకోట: గాజుల అలంకరణతో దుర్గాదేవి



జామిలో కరెన్సీ నోట్లతో వాసవీ కన్యకా పరమేశ్వరి



కొత్తవలస: దేవాడలో..



నెల్లిమర్ల: రామతీర్థంలో మహాలక్ష్మి అమ్మవారికి పూజలు

ప్రమాదవశాత్తు మేడపై నుంచి పడి..

● దివ్యాంగ యువకుడి మృతి

సాలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డు పీఎన్ బొడ్డవలసకు చెందిన దివ్యాంగుడు బండి మనోజ్‌కుమార్ (25) ప్రమాదవశాత్తు శుక్రవారం ఉదయం మేడపై నుంచి జారిపడి మృతిచెందాడు. బండి నరసింహులు, బండి దమయంతిలకు కుమారుడు మనోజ్ పుట్టుకతోనే దివ్యాంగుడు. ఇంటర్ వరకు చదువుకున్నాడు. ప్రైవేట్ షాపులో పనిచేశాడు. అయితే కొంతకాలంగా ఖాళీగానే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, మిత్రులతో చాలా ఆనందంగానే గడిపాడు. అనంతరం 10 గంటల సమయంలో అమ్మ దమయంతి మేడపై ఆరబెట్టిన ఒడియాలు ఎలా ఉన్నాయో చూసి రమ్మని చెప్పడంతో మేడపైకి ఎక్కి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ అనీల్‌కుమార్ కేసు నమోదు చేశారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

సంతకవిటి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లిట గ్రామానికి చెందిన జామి పట్టాభి(38) శుక్రవారం పాముకాటుకు గురై మృతి చెందాడు. శుక్రవారం సాయంత్రం తమ పొలంలో బెండకాయలు ఏరుతుండగా పాము కాటు వేసింది. కుటుంబీకులు వెంటనే పట్టాభిని రాజాం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పట్టాభి మృతిచెందాడు. ఈయనకు భార్య భవానితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

145 కిలోల గంజాయి స్వాధీనం

లక్కవరపుకోట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్జాం జంక్షన్ వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించిన తనిఖీల్లో 145 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్ఐ నవీన్‌పడాల్, సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించామని చెప్పారు. ఈ తనిఖీల్లో ఒక వాహనాన్ని పట్టుకుని, తనిఖీ చేయగా, 145 కిలోల గంజాయిని గుర్తించామని తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేరళకు చెందిన మహమ్మద్ షఫీ, ఒడిశాకు చెందిన డుంబూలను అరెస్టు చేశామని ఎస్ఐ నవీన్‌పడాల్ తెలిపారు. వీరిని శనివారం కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

అదనపు బంగారం కోరిన వ్యక్తిపై కేసు

బాడంగి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వివాహానికి ముందు అదనంగా బంగారం కోరిన వ్యక్తిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. బొబ్బిలికి చెందిన గ్రంథి సందీప్ గుప్తాకు బాడంగి మండలం గజరాయనివలస గ్రామానికి చెందిన కందుల చాందినికి ఈ ఏడాది మే 4న నిశ్చితార్థం జరిగింది. నిశ్చితార్థానికి ముందే ఇరు కుటుంబాల వారు పెద్దల సమక్షంలో 20 తులాల బంగారం, లక్షన్నర రూపాయల ఆడపిల్ల కట్నంగా ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. అయితే నిశ్చితార్థం రోజున 10 తులాల బంగారంతో పాటు రూ.50వేలు ఇచ్చారు. ఆగస్టు 14న వివాహం జరిపించడం కోసం ఏర్పాట్లు జరుగుతుండగా అదనంగా మరో 5 తులాల బంగారం కావాలని పెండ్లికొడుకుతో పాటు వారి తల్లిదండ్రులు కూడా ఒత్తిడి తెచ్చారు. ఇవ్వలేమని చెప్పినప్పటికీ కూడా వినలేదని దీంతో జూలై 29న స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ తారకేశ్వరరావుకు చాందిని ఫిర్యాదు చేశారు. దాంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

బెల్టు దుకాణంపై దాడి

భోగాపురం, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): పోలిపల్లి గ్రామంలో అనధికారికంగా మద్యం అమ్మకాలు చేస్తున్న బెల్టు దుకాణంపై శుక్రవారం దాడి చేశామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ తెలిపారు. ఈ దాడిలో ఎనిమిది మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ దాడిలో ఎస్ఐ చంద్రమోహన్, హెచ్‌సీ ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

బొండపల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బొండపల్లి పంచాయతీ మధుర గ్రామం గెద్దపేట సమీపాన చెరువు గట్టు వద్ద పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేసి జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. గురువారం రాత్రి వారి వద్ద నుంచి 20 వేల 240లు నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఐ యు.మహేష్ తెలిపారు.

సారా ధ్వంసం

బెలగాం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణ శివారులో శుక్రవారం 17 కేసుల్లో పట్టుబడిన 772 లీటర్ల సారాను ఏఎస్పీ అంకితా సురాన ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్టు పోలీసులు తెలిపారు. సారా నిర్మూలను పటిష్ఠ చర్యలు చేపట్టామన్నారు. సారా రహిత జిల్లాగా రూపుదిద్దడమే లక్ష్యంగాచర్యలు చేపడుతున్నామన్నారు. సీఐలు మురళీధర్, గోవింద్, ఎస్ఐలు పాల్గొన్నారు.

సంగీత కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

విజయనగరం కల్చరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విజయనగరం మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో వివిధ కోర్సుల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కలెక్టర్ అంబేడ్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. నాలుగు, రెండేళ్ల సర్టిఫికేట్, డిప్లొమా కోర్సుల్లో శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. గాత్రం, వయోలిన్, వీణ, నాదస్వరం, మృదంగం, డోలు, భరతనాట్యం కోర్సులకు అర్హులైన అభ్యర్థులు ఈనెల 1 నుంచి 15 వరకూ రూ.50 ఆలస్య రుసుం, 16 నుంచి 31 వరకూ రూ.100 ఆలస్య రుసుంతో దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. 2021 జూలై 1 నాటికి పదేళ్ల నిండి 60 ఏళ్ల లోపు ఉన్నవారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి 9.30 గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి 6.30 గంటల వరకూ అభ్యర్థులు ఒక పూట, లేదా రెండు పూటలా హాజరు కావచ్చునని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్‌ని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేని కలిసిన ఫేకర్ కార్మికులు

గరివిడి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఫేకర్‌లో పనిచేస్తున్న కార్మికులు ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావును చీపురుపల్లిలో గల తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కలిశారు. గత కొద్ది రోజులుగా ఫేకర్ పరిశ్రమను కూల్చివేస్తున్నారని ఎమ్మెల్యే ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాలుగా పరిశ్రమలో పనిచేస్తున్న తమ భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. ఫేకర్ యాజమాన్యంతో చర్చలు జరిపి, న్యాయం చేస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు.

ప్రముఖుల దృష్టికి జిందాల్ నిర్వాసితుల సమస్య

ఎస్.కోట రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్ నిర్వాసితుల సమస్యలను డిల్లీలో ప్రముఖులకు వివరించానని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. బుధవారం ఆయన బొడ్డవరలో విలేకర్లతో మాట్లాడారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వాసితులు తమ సమస్యలను వివిధ పద్ధతుల్లో వివిధ సంఘాలకు వివరించారని చెప్పారు. అయితే తన వంతు బాధ్యతగా డిల్లీలో రెండురోజుల పాటు పర్యటించి పలువురు ప్రముఖులను కలిసి నివేదించానని, వారి నుంచి సానుకూల స్పందన కనిపించిందని తెలిపారు. న్యాయ పోరాటంలో భాగంగా హైకోర్టును ఆశ్రయించామని చెప్పారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే పూర్తిస్థాయిలో చొరవ చూపి పరిష్కరించాలని ఆయన కోరారు.

ఉప ముఖ్యమంత్రికి నివేదిస్తాం

శృంగవరపుకోట రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో శాంతియుత పోరాటం చేస్తున్న జిందాల్ నిర్వాసితుల సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి నివేదిస్తామని జనసేన పార్టీ జిల్లా నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు తెలిపారు. బొడ్డవర గ్రామంలోని జిందాల్ నిర్వాసితులను ఆయన బుధవారం కలిసి, సంఘీభావం తెలిపారు. ఈ సమస్యను కలెక్టర్ జోక్యం చేసుకుని పరిష్కరించాలని, ప్రభుత్వం వేగవంతంగా పరిశ్రమలు ఏర్పాటుచేయాలని కోరారు. జనసేన నాయకుడు శ్రీనివాసరాజు, సీపీఎం జిల్లా నేత చల్లా జగన్ పాల్గొన్నారు. అనంతరం నిర్వాసితులతో కలిసి బొడ్డవర- విజయనగరం ప్రధాన రహదారిపై ర్యాలీగా వెళ్లారు. అదే సమయంలో పోలీసులు చేరుకుని సెక్షన్-30 అమల్లో ఉందని, నిలిపివేయాలని కోరారు. దీంతో వారు వెనుదిరిగారు.

పాఠశాల తనిఖీ

మెరకముడిదాం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గర్భాం జడ్పీ ఉన్నత పాఠశాలను డీఈవో మాణిక్యాలనాయుడు శుక్రవారం సందర్శించారు. పాఠశాల రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాదిలాగే పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం ఎమ్మార్సీ భవనాన్ని పరిశీలించారు. ఎంఈవో-2 టి.ధర్మశ్రీ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగుకు సాయం

(3వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండ మండలం కొండాపురంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు.

పక్కాగా నిర్వహణ

జిల్లాలో అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వ్యవసాయాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని నియోజకవర్గాల స్థాయిలో, రైతు సేవా కేంద్రా ల్లోనూ నిధుల పంపిణీ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిర్వ హించాలని సూచించారు. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద జిల్లాలో 1,22,260 మంది రైతుల ఖాతాల్లో మొదటి విడతగా రూ. 84.58 కోట్లు జమకానుందని వెల్లడించారు.

పార్టీ ఆదేశానుసారం పనిచేయాల్సిందే

(3వ పేజీ తరువాయి)

ఇన్‌చార్జి భూదేవి అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని, మిగిలిన వారు కూడా ఆమెకు సహకరించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొందరు నాయకులు లేచి నియోజకవర్గంలో టీడీపీలో ఉన్న కొందరు జనసేన పార్టీ ఎమ్మెల్యేతో కలిసి పనిచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఇటువంటి వ్యక్తులే గ్రామ/ మండల కమిటీలు నియామకంలో అడ్డుపడుతున్నారని వ్యాఖ్యానించారు. సమావేశంలో అరకు పార్లమెంటు అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్, పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జిలు టి. హర్షవర్ధన్, శివ్వాల సూర్యనారాయణ, నియోజకవర్గం పరిధిలో మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, ఉదయాన ఉదయభాస్కర్, ముఖలింగం, భోగాపురం రవినాయుడు, పాలకొండ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు

(3వ పేజీ తరువాయి)

పునరావృతం కారాదని, విద్యార్థులు అనారోగ్యానికి గురైతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని పీవో స్పష్టం చేశారు. ఆయన వెంట గిరిజన సంక్షేమశాఖ డీడీ ఆర్.కృష్ణవేణి, ఇతర అధికారులు ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవంలో భాగస్వాములు కావాలి

పార్వతీపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న నిర్వహించనున్న ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో భాగస్వాములు కావాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో శ్రీవాత్సవ గిరిజన సంఘాల నాయకులను కోరారు. స్థానిక గిరిమిత్ర సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ.. వేడుకలకు సంబంధించి తగిన సూచనలు, సలహాలు అందించాలన్నారు. అర్హులైన గిరిజనులకు ఉపకరణాలు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేయనున్నామని వెల్లడించారు.

వాడకం ఇలా.. మరి రక్షణ ఎలా?



బీరపాదుకు రక్షణగా కట్టిన దోమతెర

సీతంపేట రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో దోమ తెరల వినియోగంపై గిరిజనుల్లో అవగాహన కొరవడింది. దోమల నుంచి రక్షణ కోసం ప్రభుత్వం ప్రతీ నాలుగేళ్లకు ఒక్కసారి దోమ తెరలను గిరిజన ప్రాంతాల్లో పంపిణీ చేస్తుంది. అయితే వీటి వినియోగంపై మలేరియా శాఖ గ్రామస్థాయిలో అవగాహన కల్పించకపోవడం మూలంగా గిరిజనులు పలు రకాలుగా వీటిని వినియోగిస్తున్నారు. కొందరు కూరగాయాల పాదులకు రక్షణ తెరలుగా, మరి కొందరు వాలీబాల్ నెట్‌గా వినియోగిస్తున్నారు. దోమల నుంచి వీరికి రక్షణ లేకపోవడంతో వ్యాధులకు గురవుతున్నారు.

బొబ్బిలి ఎస్‌ఐగా ప్రకాశ్

బొబ్బిలి, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణ ఎస్‌ఐగా ఎన్‌వీఎస్ ప్రకాశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరంలోని ఎస్పీ కా ర్యాలయం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

రసాయనాలు లేని పంటలతో ప్రజారోగ్యం



మాట్లాడుతున్న ఏడీఏ మధుసూదనరావు

బొబ్బిలి రూరల్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): రసాయిన అవశేషాలు లేని నాణ్యమైన పంటలు పండించి ప్రజారోగ్యానికి పెద్దపీట వేసే దిశగా ఇండియా గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ (ఇండ్‌గ్యాప్) ఫలితాలిస్తున్నాయని బొబ్బిలి ఏడీఏ మధుసూదనరావు అన్నారు. మండలంలోని కారాడలో ఓ రైతు పొలంలో శుక్రవారం పొలం బడిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రసాయిన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని దశల వారీగా తగ్గిస్తూ రసాయినిక అవశేషాల్లేని నాణ్యమైన, అధిక దిగుబడులు ఉత్పత్తి సాధించే ఇండ్ గ్యాప్ పద్ధతిని రైతులు అవలంబించాలన్నారు. రసాయిన ఎరువులు స్థానంలో నానో యూరియా, నానో డీఏపీ వాడాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం, ఏఈవో సంతోషి, వీఏఏ ఐశ్వర్య, రైతులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

గరుగుబిల్లి, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరపతి సంఘం పరిధిలోని రైతులకు మెరుగైన సేవలందించాలని కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని రావివలసలో ప్రాథమిక పరపతి సంఘం పర్సన్ ఇన్‌చార్జి కోట గౌరమ్మ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా పలు ఆటంకాలను కల్పించిదన్నారు. సహకార సంఘాలను బలోపేతం చేయకుండా వ్యవస్థను భ్రష్టు పట్టించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తదుపరి రైతులను ఆదుకునేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం వ్యవసాయశాఖ మంజూరు చేసిన కిసాన్ డ్రోన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు ముదిలి రాధ, మంత్రబుడ్డి జానకితో పాటు ఎంపీటీసీ సభ్యులు కోట భరత్‌కుమార్, పార్టీ ప్రతినిధులు ఎ.మధుసూదనరావు, ఎం.పురుషోత్తంనాయుడు, ఎం.తవిటి నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గరుగుబిల్లి, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రన్నగుడి సముదాయంలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గరుగుబిల్లి ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు తెలిపిన వివరాల మేరకు శివరాంపురం గ్రామానికి చెందిన పి.లక్ష్మణ వీరఘట్టం మండలం కెల్లలోని బంధువులను చూసేందుకు వెళుతుండగా పార్వతీపురం నుంచి వీరఘట్టం వెళుతున్న వ్యాన్ ఢీ కొట్టిందన్నారు. ప్రమాదంలో లక్ష్మణకు కుడి కాలికి తీవ్ర గాయమైందన్నారు. చికిత్స నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

ఘనంగా మహాలక్ష్మీ పూజలు



మహాలక్ష్మీదేవి పూజలో రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

సాలూరు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మహాలక్ష్మి పూజను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో సుమారు 1500 మంది మహిళలు పాల్గొన్నారు. పూజ అనంతరం మహిళలకు అమ్మవారి ప్రసాదాన్ని, చీరలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వైదేహి, వరలక్ష్మి, వాడాడ శోభారాణితో పాటు మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు.

సంతోషిమాతకు శ్రావణ పూజలు

●భామిని, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): బత్తిలిలోని సంతోషిమాత ఆలయంలో రెండో శ్రావణ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు తాతబాబుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తూరు, గుమ్మలక్ష్మీపురం, ఒడిశా, గుణుపూర్ ప్రాంతం నుంచి అమ్మవారి దర్శనానికి భారీ సంఖ్యలో మహిళలు విచ్చేశారు.

పార్వతీదేవి ఆలయంలో..

●పార్వతీపురం టౌన్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిలో గల పార్వతీదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. అలాగే ప్రధాన రహదారితో పాటు ఆడబడి వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోనూ సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.



పార్వతీపురం టౌన్: పూజలు చేస్తున్న మహిళలు

ఒక్కరోజే లక్ష పింఛన్లు



పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం టౌన్/ బెలగాం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఒక్కరోజే లక్ష మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మెల్యే విజయచంద్ర లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా పెద్ద మొత్తంలో పింఛన్లు అందజేస్తున్నామన్నారు. 2021 నుంచి వైసీపీ ప్రభుత్వం వితంతువులకు పెండింగ్‌లో పెట్టిన పింఛన్లను కూటమి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం అన్ని వర్గాలను వేధిస్తే.. చంద్రబాబు ప్రభుత్వం అన్నివర్గాలను ఆదరిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మెప్మా ఎండీ, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం



పింఛన్ పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి విజయరామరాజు

జియ్యమ్మవలస, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ నేత శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. శుక్రవారం చినమేరంగిలోని తన నివాసంలో సామాజిక పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. దేశంలో అభివృద్ధిలో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దగల సత్తా చంద్రబాబుకు ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.రవి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాగాల అప్పలకొండ, టీడీపీ నాయకులు బి.ప్రకాశ్, అల్లు ఈశ్వరరావు, బొత్స జైపాల్, జనసేన నాయకులు వి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం



వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ

బెలగాం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీస్ సిబ్బంది, అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానన్నారు. ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీసీ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన

పాలకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీవర్స్ కాలనీ సచివాలయం పరిధిలో రెల్లివీధి, జంగాలవీధి, వెంకంపేట, గొల్లవీధి, కొత్తవీధి అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లి పాల ఆవశ్యకతను సీడీపీవో రంగలక్ష్మి, సూపర్‌వైజర్ ఎల్.శాంతకుమారి బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అమరవేణి, శారద, శ్యామల, శ్రీదేవి పాల్గొన్నారు.

●కొమరాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పుట్టిన పసిపిల్లలకు తల్లిపాలతోనే ఆరోగ్యం సాధ్యమని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.సుగుణకుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-5లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాలలో పోషకాలపై అవగాహన కల్పించారు. అలాగే విక్రంపురం సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్ బంగారమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు

●సాలూరు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): శివరాంపురంలో తల్లిపాల వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త దండి పార్వతి బాలింతలకు ఆమె తల్లిపాల ఆవశ్యకత వివరించారు. అనంతరం గ్రామంలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

భామినిలో వర్షం

భామిని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. గత వారం రోజులుగా ఎండలకు వరి పొలాలు నాటిన వరిచేలు వాడిపోతున్న సమయంలో కురిసిన వర్షం రైతులకు ఊరటనిచ్చింది. బత్తిలి, కాట్రగడ, నేరడి, గురండి, బిల్లుమడ, సింగిడి, భామిని తదితర ప్రాంతాల్లో భారీవర్షం కురిసింది.

బాలేసుగూడకు రక్షిత నీరు

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలేసుగూడలో తాగునీటికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఏర్పాట్లు చేశారు. 300 లీటర్ల వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి కుళాయిల ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్, సర్పంచ్ పాల్గొన్నారు.

ఆరుగురు విద్యార్థులు ఎక్కడికెళ్లారు?

● వసతిగృహ నిర్వహణపై ప్రత్యేక అధికారి అసహనం



రికార్డులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

పాచిపెంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర వెనుకబడిన సంక్షేమశాఖ వసతిగృహాన్ని శుక్రవారం మండల ప్రత్యేక అధికారి రాధాకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 100 మంది విద్యార్థులు ఉండాల్సిన బీసీ వసతిగృహంలో ఎనిమిది మంది విద్యార్థులు ఉండటంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. రిజిస్టర్ ప్రకారం 14 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు గుర్తించారు. గైర్హాజరైన విద్యార్థుల విషయమై మేట్రిన్ ప్రమీలతో ఆయన మాట్లాడారు. వారంతా హైస్కూల్‌కు వెళుతున్నారా? లేదా? ఇంటి దగ్గరే ఉన్నారా? అని ప్రశ్నించారు. దానికి ఆమె ఇంటి దగ్గరే ఉంటున్నట్టు తెలిసిందని బదులిచ్చారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వసతిగృహానికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇక్కడి వసతిగృహంలో బీసీ విద్యార్థులు జాయిన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని మేట్రిన్‌కు సూచించారు. వసతి గృహంలోని విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. తనిఖీలో ఎంపీడీవో బీవీజే పాత్రో ఉన్నారు.

చినమేరంగి సీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



మహిళతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్

జియ్యమ్మవలస, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ గొర్లి నాగభూషణరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యాధికారులు డాక్టర్ ఆర్‌ఆర్‌కే చైతన్య, డాక్టర్ చంద్రవర్మ, డాక్టర్ రమ్యలతో మాట్లాడారు. ఐపీ వార్డులో రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరుపై ఆరా తీశారు. ప్రతీ వార్డును పరిశీలించిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో వైద్య సేవలు అందుతున్న తీరు బాగుందన్నారు. వైద్యుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెడ్ నర్స్ ఎం.రాజేశ్వరి, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఫ్యాప్టో నాయకులు

సీతానగరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదుట శనివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) తలపెట్టిన ధర్నాను అందరూ విజయవంతం చేయాలని మండల ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నాయకులు శ్రీనివాసరావు, ప్రసాదరావు కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో విలేఖరులతో వారు మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలలు, బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు పి.కూర్మినాయుడు, యూటీఎఫ్ మండల సభ్యులు, ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సత్యనారాయణ, ఎస్.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు

నేడు మండల సమావేశం

భామిని, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): భామిని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల అధ్యక్షురాలు తోట శాంతికుమారి అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.వసంత తెలిపారు. సమావేశానికి సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రైవేట్ క్లినిక్‌లపై దాడులు

పాలకొండ, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రైవేట్ క్లినిక్‌లపై శుక్రవారం తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి, వైద్యాధికారి శివశంకర్, పోలీసులు దాడులు నిర్వహించారు. అనుమతులపై ఆరా తీశారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నడిపితే చర్యలు తప్పవన్నారు. ఇందిరానగర్ కాలనీ ఎదుట ఉన్న క్లినిక్‌తో పాటు ఎం.కె.రాజపురంలో క్లినిక్‌లకు అనుమతులు లేవని అధికారులు గుర్తించారు. వాటిని మూసివేయాలని ఆదేశించారు.

●సీతంపేట రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): సీతంపేటలో నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లపై వైద్య, రెవెన్యూ, పోలీసు అధికారులు శుక్రవారం దాడులు చేపట్టారు. సీతంపేట, కుసిమి సెంటర్‌లో నిర్వహిస్తున్న ఐదు క్లినిక్‌లను డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వరరావు, కుసిమి పీహెచ్‌సీ వైద్యాధికారి శివశంకర్, ఎస్‌ఐ అమ్మనరావు తనిఖీ చేశారు. వీటిలో మూడు క్లినిక్‌ల నిర్వహణ సక్రమంగా లేదని గుర్తించిన అధికారులు వారికి మెమోలు అందజేశారు.

●బెలగాం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు ప్రైవేట్ క్లినిక్‌పె శుక్రవారం అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో ఇందిరానగర్, ఎం.కె.రాజపురం క్లినిక్‌లు అనుమతులు లేవని గుర్తించారు. తక్షణమే వాటిని మూసివేయాలని రెవెన్యూ అధికారి రాధాకృష్ణ, వైద్యాధికారి శివశంకర్, పోలీసులు ఆదేశించారు.

బెల్లపాకను రోడ్డుకు మరమ్మతులు

సాలూరు రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): బెల్లపాక నుంచి కరడవలసకు గిరిజనులు శ్రమదానంతో రోడ్డును శుక్రవారం రోడ్డును బాగు చేసుకున్నారు. రోడ్డు గోతులమయం కావడంతో అందరూ సమష్టిగా కదిలారు. డబ్బులు పోగుచేసి ఎక్స్‌కవేటర్ సాయంతో పనులు చేయించారు.

ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె



ఆందోళన చేస్తున్న అద్దె బస్సుల డ్రైవర్లు

పార్వతీపురం టౌన్, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): వేతన ఒప్పందాన్ని యజమానులు, ఆర్టీసీ అధికారులు వెంటనే అమలు చేయాలని కోరుతూ అద్దె బస్సుల డ్రైవర్లు సమ్మెకు దిగారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో గేటు ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ 2019 నుంచి నేటివరకు ఇప్పటి వరకు అద్దె బస్సుల యజమానులు వేతన సవరణ చేయకపోవడం వల్ల 12 గంటల నుంచి 18 గంటలు శ్రమిస్తున్న డ్రైవర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేతన సవరణ చేయాలని ఆర్టీసీ అధికారులతో పాటు కలెక్టర్, కార్మికశాఖాధికారులకు వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోక పోవడం దురదృష్టకరమన్నారు.తీసుకోనని డిపో మేనేజర్ దుర్గాదేవి భయభ్రాంతులకు గురిచేయడం సరికాదన్నారు. అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళన ప్రాంతానికి వచ్చిన ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి వెంకటేశ్వర్లుతో సీఐటీయూ నాయకులు మన్మథరావు, బీవీ రమణ మాట్లాడుతూ సమస్యను పరిష్కరించాలని కోరారు. అధికారులు, బస్సు యజమానులు స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. లేకుంటే సమ్మెను విరమించే ప్రస్తకే లేదని హెచ్చరించారు.

పీజీ సెంటర్ ఏర్పాటు చేయండి

బెలగాం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీజీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పావని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ డిగ్రీ తర్వాత పై చదువుల కోసం జిల్లా విద్యార్థులు పక్క జిల్లాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఇంత వరకు డిగ్రీ తరగతులను ప్రారంభించకపోవడం అన్యాయ మన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంను సస్పెండ్ చేయండి

పార్వతీపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలంలోని కెమిశీల గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ పీవో సందర్శించిన సమయంలో లోటుపాట్లను ఆయన స్వయంగా గుర్తించారన్నారు. అందుకు కారణమైన హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, తాడంగి సాయిబాబు, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పల్ల సురేష్, గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు ఆరిక చంద్రశేఖర్, ట్రైబల్ రైట్స్ ఫోరం నాయకులు ఇంటికుప్పల రామకృష్ణ, రొబ్బ లోవ రాజు, గిరిజన ఐక్యవేదిక నాయకులు తమ్మయ్య, విప్లవ కుమార్, రాజు, బంగా రాజు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండండి

పాలకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైబర్ నేరాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని శక్తి టీం ఏఎస్ఐ పి.సురేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని వెంకంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారుల భద్రత, హెల్ప్‌లైన్ 1972, ఈగల్, మహిళా రక్షణ తదితర వాటిపై వివరించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రాము, గణపతి, గణేష్‌బాబు, హెచ్‌ఎంలు వెంకటరమణ, భాస్కరరావు, పరాంకుశంనాయుడు, పుష్పనాథం పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

సీతంపేట రూరల్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దోనుబాయి సమీపంలో ఎస్ఐ మస్తాన్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాలలో భాగంగా తనిఖీలు ముమ్మరం చేశారు. దోనుబాయి రహదారి మీదుగా ప్రయాణిస్తున్న వాహనాల్లోని ప్రయాణికుల వివరాలను తెలుసుకున్నారు.

సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చు

పాలకొండ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఫిర్యాదుల విభాగాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ రత్నంరాజు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగర పంచాయతీ పరిధిలో వీధి దీపాలు, తాగునీరు, పారిశుధ్యం తదితర సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదుల విషయమై నగర పంచాయతీ అసిస్టెంట్ ఇంజనీర్ 9032439484 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

130 పింఛన్లు మంజూరు

వీరఘట్టం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగా 130 స్పౌజ్ పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో బి.వెంకటరమణ తెలిపారు. కొత్తగా మంజూరైన పింఛన్లతో కలిపి 9707 పింఛన్లు మండలంలో పంపిణీ చేస్తున్నామన్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు 8429 పింఛన్లు పంపిణీ పూర్తయిందన్నారు.

118 మందికి ..

●పాచిపెంట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన 118 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు పింఛన్ల పంపిణీ చేశారు.

విద్యుత్ చార్జీల పెంపుదల ఆపండి

కొమరాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపుదలను ఆపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ఆగస్టు 5న కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆయన కొమరాడలో విడుదల చేశారు. సాంబమూర్తి మాట్లాడుతూ గత సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 9 అలసార్లు విద్యుత్ చార్జీలు పెంచి పేదల ప్రజలపైన విపరీతమైన భారం మోపే సందర్భంగా ఉందన్నారు. ఇప్పటికే గృహాలకు బిగించిన విద్యుత్ స్మార్ట్ మీటర్లను తొలగించాలని, భవిష్యత్తులో గృహాలకు కూడా విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే విధానాన్ని అందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.